సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



పెళ్లి సందడి 8లో▸

ఫిబ్రవరి మొదలుకుని జూన్ మొదటివారం వరకు పెళ్లిళ్లకు శుభ ముహూర్తాలు ఉన్నాయి. పెళ్లి పెద్దలు, సంబంధిత కుటుంబాల వారు వేడుకలకు సన్నద్ధమవుతున్నారు.



తరలిపోనున్న ఏసీబీ కార్యాలయం

ఆదిలాబాద్‌లోని ఏసీబీ కార్యాలయం మంచిర్యాలకు తరలిపోనుంది. ఈ నెల 14న ఇక్కడి నుంచి తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపించనుంది.

న్యూస్‌రీల్

'స్థానిక' ఎన్నికల ప్రక్రియ వేగవంతం

కైలాస్‌నగర్: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రక్రియను యంత్రాంగం వేగవంతం చేసింది. ప్రభుత్వం నోటిఫికేషన్ ఎప్పుడు ప్రకటించినా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రిటర్నింగ్,సహాయ రిటర్నింగ్ అధికారుల శిక్షణ తేదీలను ఖరారు చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి 60 మంది చొప్పున ఆర్వో, ఏఆర్వో, గ్రామ పంచాయతీలకు సంబంధించి 149 మంది ఆర్వో, 181 మంది ఏఆర్వోలను నియమించారు. వీరందరికి ఎన్నికల ప్రక్రియలో అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ నెల 14న ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10గంటలకు మాస్టర్ ట్రైనర్లు వీరికి శిక్షణ ఇచ్చేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

కైలాస్‌నగర్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఓటర్ల తుది జాబితా ప్రకటించిన జెడ్పీ అధికారులు తాజాగా ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 20 మండలాల పరిధిలో 875 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిపై ఈ నెల 13వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 14న గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించనున్నారు. 15న పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రకటించనున్నారు.

'డయల్ యువర్ డీఎం'కు స్పందన

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించింది. పలువురు ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు, వినతులను డీఎం కల్పన దృష్టికి తీసుకురాగా ఆమె సానుకూలంగా స్పందించారు. ఇచ్చోడ బస్‌స్టేషన్లో టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని భూమయ్య, రంజిత్, ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీస్ నడపాలని శ్రీకాంత్ విన్నవించాడు. బేల మండలంలోని శంషాబాద్ గ్రామం వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని మౌనిక, ప్రియ కోరారు. అలాగే ఉట్నూరు నుంచి నిర్మల్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని శ్రీకాంత్ కోరాడు. ప్రయాణికుల వినతులను నమోదు చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని డీఎం హామీ ఇచ్చారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



పరుగు పందెం పోటీ ప్రారంభిస్తూ..

ఆదిలాబాద్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 'చలో ఆదిలాబాద్ అథ్లెటిక్స్ ప్రైవేట్ స్కూల్ చాంపియన్‌షిప్' పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నా రు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేశ్, స్వామి, కోచ్ రాకేశ్ పాల్గొన్నారు.

18న జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఈనెల 18న జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘుపతి, రాష్ట్రపాల్ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. ఏప్రిల్ 1, 2009 తర్వాత జన్మించి, 55కిలోల బరువు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 7702035200 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సేవాలాల్ జయంతికి రూ.2.24 లక్షలు విడుదల

కైలాస్‌నగర్: లంబాడాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసింది. ఈనెల 15 నుంచి 21వరకు నిర్వహించనున్న వేడుకల కోసం ఆదిలాబాద్ నియోజకవర్గానికి రూ.30 వేలు, బోథ్ నియోజకవర్గానికి రూ.1లక్ష 94వేలు మంజూరు చేసింది. రెండు నియోజకవర్గాలకు కలిపి రూ.2.24 లక్షలు విడుదల చేస్తూ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ శరత్ ఉత్తర్వులు జారీ చేశారు.



భోరజ్ వద్ద పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో అధికారులు

బర్డ్‌ఫ్లూ.. అలర్ట్

- అప్రమత్తమైన యంత్రాంగం
- భోరజ్ వద్ద ప్రత్యేక చెక్‌పోస్టు
- మహారాష్ట్ర నుంచి వచ్చే కోళ్ల వాహనాల తనిఖీ
- ఆందోళన అవసరం లేదంటున్న అధికారులు

కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకుతుండడంతో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు భోరజ్ వద్ద

చెక్‌పోస్టు ఏర్పాటు..

ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ముగ్గురు వైద్యులతో పాటు మరో ముగ్గురు ప్యారా అధికారులను నియమించారు. వీరు మహారాష్ట్ర నుంచి వచ్చే కోళ్ల వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ ప్రాంతంలో బర్డ్‌ఫ్లూ వచ్చిందా.. లేదా అనే వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తున్నారు. సంబంధిత ఫామ్‌ల నుంచి వచ్చేటప్పుడు ధ్రువపత్రాలు ఉంటేనే జిల్లాలోనికి అనుమతి ఇస్తామని స్పష్టం చేస్తున్నారు.

ఆదిలాబాద్‌టౌన్: కోళ్లకు బర్డ్‌ఫ్లూ రావడంతో జనం ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఇన్‌ఫ్లూయెంజా వైరస్ కారణంగా ఫామ్‌లలో వేలాదిగా కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. జిల్లాలోని కోళ్ల ఫామ్‌లలో ఎక్కడైనా కోళ్లు మరణిస్తున్నాయా.. వాటికి రోగాలు వస్తున్నాయా అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. సాధారణం కంటే ఎక్కువ మొత్తంలో మరణిస్తే వాటి నుంచి శాంపిళ్లు సేకరించాలని ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో అలర్ట్ అయిన యంత్రాంగం మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే కోళ్ల వాహనాలను ప్రత్యేకంగా తనిఖీ చేస్తున్నారు.

ఫామ్‌ల యజమానులతో సమీక్ష..

బర్డ్‌ఫ్లూగా పరిగణిస్తున్న హైలీ పాథోజెనిక్ ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ కారణంగా పక్క రాష్ట్రాల్లో కోళ్లు మరణిస్తున్నాయి. ఆ ప్రాంతాల్లోని కొన్ని జిల్లాల్లో చికెన్ అమ్మకాలు సైతం నిలిపివేసినట్లు తెలుస్తోంది. మరణించిన కోళ్లను, గుడ్లను కూడా పూడ్చిపెట్టి కిలోమీటర్ పరిధి వరకూ రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆ పరిసర ప్రాంతాల్లో నిఘా పెడుతున్నట్లు సమాచారం. ఫారాల్లో పనిచేస్తున్నవారి ఆరోగ్య పరిస్థితిని సైతం గమనిస్తున్నారు. కోళ్లకు సంబంధించిన శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. ఇక జిల్లాలో ఎనిమిది వరకు కోళ్ల ఫామ్‌లు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో 30వేల నుంచి 40వేల వరకు కోళ్లు ఉన్నాయని, అయితే ఇప్పటి వరకు ఆ వైరస్ సంక్రమించలేదని పేర్కొంటున్నారు. అయితే విదేశీ వలస పక్షుల్లో ఉండే వైరస్ అవి విసర్జించే రెట్టల ద్వారా జలాశయాల్లో చేరి అక్కడి నుంచి కోళ్లకు సంక్రమిస్తుందని చెబుతున్నారు. జనవరి వరకు చలికాలం కావడం, ఉష్ణోగ్రత తక్కువగా ఉండటంతో కోళ్లు మరణించాయని చెబుతున్నారు.

గుడ్లు తినొచ్చా.. లేదా అనే సందేహం

కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకుతుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండడంతో చికెన్ ప్రియులు ఆందోళన చెందుతున్నారు. చికెన్, గుడ్లు తినొచ్చా.. లేదా అనే సందిగ్ధంలో పడ్డారు. అయితే గతంతో పోల్చితే ప్రస్తుతం చికెన్ విక్రయాలు కొంత తగ్గుతున్నట్లు తెలుస్తోంది. ధరసైతం పడిపోతూ వస్తోంది. ఈ వైరస్ 32 నుంచి 34 డిగ్రీ సెల్సియస్ వద్ద జీవించి ఉండదని, ప్రస్తుతం 34 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రత నమోదవుతున్నందున ఎలాంటి భయం అవసరం లేదంటున్నారు వైద్యాధికారులు. ఉడకబెట్టిన గుడ్లు తినొచ్చని చెబుతున్నారు. అయితే ఆమ్లెట్, హాఫ్ బాయిల్డ్ ఎగ్ వంటివి తినకపోవడం మంచిదని సూచిస్తున్నారు.

ఆందోళన వద్దు..

పక్క రాష్ట్రాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకుతుండడంతో భోరజ్ వద్ద ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశాం. వైద్య బృందాలను సైతం నియమించాం. ప్రస్తుతం జిల్లాలోని కోళ్లకు ఆ వైరస్ లక్షణాలు లేవు. ఫామ్ యజమానులతో ఇటీవల సమావేశం నిర్వహించాం. కోళ్లు మరణిస్తే వాటికి సంబంధించిన శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
– కిషన్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

మందుబాబుల జేబులకు చిల్లు

- బీర్ల ధర 15శాతం పెంపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- కొత్త స్టాక్ నుంచి అమల్లోకి..



ఆదిలాబాద్‌టౌన్: మందుబాబులకు ఇది చేదు వార్త. వారి జేబులకు ఇకచిల్లు పడనుంది. బీర్ల ధర 15 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొన్నటివరకు శీతాకాలంలో వీటి అమ్మకాలు తగ్గగా, ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతుండడంతో మద్యం ప్రియులు బీర్ల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా రేట్లు పెంచడంతో ఖంగు తింటున్నారు. బీరుపై రూ.22 నుంచి రూ.30 వరకు పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. మద్యం ధరలు పెరిగినా.. తగ్గినా అటు మందు బాబులు మాత్రం తగ్గేదేలే అంటున్నారు. ధరలు పెంచాలని బీర్ల కంపెనీలు ఇటీవల ప్రభుత్వానికి విన్నవించిన విషయం తెలిసిందే. కేఎఫ్ కంపెనీ కమీషన్ పెంచకపోవడంతో కొద్ది రోజుల పాటు సరుకును నిలిపివేసిన విషయం విదితమే. ఆ తర్వాత ప్రభుత్వం చర్చలు జరపడంతో మళ్లీ షురూ చేశారు. ప్రస్తుతం పెంచిన ధరలతో ఆయా కంపెనీలకు కమీషన్‌తో పాటు ప్రభుత్వానికి సైతం ఆదాయం పెరగనుంది. ఇప్పటి వరకు లైట్ బీరు ధర రూ.150 ఉండగా, రూ.180 వరకు పెరగనున్నట్లు తెలుస్తోంది. అలాగే స్ట్రాంగ్ బీరు ధర రూ.160 ఉండగా, రూ.190 వరకు పెరగనున్నట్లు సమాచారం.

పెరగనున్న అమ్మకాలు..

వేసవిలో మద్యం ప్రియులు విస్కీతో పోల్చితే బీర్ల వైపే మొగ్గు చూపుతారు. జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం, ఎండ నుంచి సేద తీరేందుకు ఎక్కువగా చిల్డ్ బీర్లకే ప్రాధాన్యం ఇస్తారు. వేసవిలో వీటి అమ్మకాలు 30 శాతం అధికంగా ఉంటుందని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇక డిపోల నుంచి కొత్త సరుకు వచ్చే వరకు పాత ధరలోనే విక్రయించాలని పేర్కొంటున్నారు. వైన్స్ యజమానులు ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవంటున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ హిమశ్రీని వివరణ కోరగా, కొత్త ధరలకు సంబంధించి ఇంకా ఉత్తర్వులు రాలేదని తెలిపారు. అప్పటివరకు పాత ధరతోనే విక్రయాలు చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

జిల్లాలో రెండేళ్లలో లిక్కర్, బీర్ల అమ్మకాలు(కేస్‌లలో)

సంవత్సరం	లిక్కర్	బీర్లు	ఆదాయం (రూ.కోట్లలో)
2023	5,12,719	3,40,798	382.45
2024	5,61,362	3,65,768	412.76

ఎస్పీ దంపతులకు ఘన స్వాగతం



ఎస్పీని భుజాలపై ఎత్తుకొని డ్యాన్స్ చేస్తున్న పోలీసులు

ఈ నెల 6న బిహార్ రాష్ట్రంలోని గయా జిల్లాలో ఎస్పీ గౌస్ ఆలం వివాహం జరిగిన విషయం తెలిసిందే. పెళ్లి వేడుకల అనంతరం ఎస్పీ దంపతులు మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. స్థానిక కుమురంభీం చౌక్ వద్ద జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అక్కడి నుంచి క్యాంప్ కార్యాలయం వరకు డీజే చప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. ఇందులో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సైబర్‌క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా, వన్‌టౌన్, టూటౌన్, రూరల్, ట్రాఫిక్ సీఐలు సునీల్‌కుమార్, కరుణాకర్‌రావు, ఫణిందర్, ప్రణయ్ కుమార్, ఎస్సైలు అశోక్, దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు. – ఆదిలాబాద్‌టౌన్

సంస్కృతిని కాపాడుకోవాలి



విద్యార్థులతో కలిసి గుస్సాడీ నృత్యం చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

- కలెక్టర్ రాజర్షిషా
- అలరించిన జిల్లా స్థాయి గిరిజన సాంస్కృతిక మేళా



తీజ్ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇంద్రవెల్లి: విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ట్రైబల్ కల్చరల్ మీట్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వివిధ పాఠశాలల విద్యార్థులు గుస్సాడి, గోండ్, తీజ్ వంటి సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. వారితో కలిసి కలెక్టర్ రాజర్షిషా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ కాలు కదిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. కాగా, సరిపడా టెంట్లు లేక విద్యార్థులు ఎండలో కూర్చొని ఇబ్బందులకు గురయ్యారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంఈవో రాథోడ్ మానుకుమార్, ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిస్తీలకు పైసల్లేవ్!

బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ ఈఎంఐ బకాయిలు రూ.1,87,725 పేరుకుపోయాయి. అలాగే సిరికొండ మండలం పోచంపల్లి పంచాయతీలో రూ.1,47,262లు, బోథ్ మండలం గుర్రాలతండా పంచాయతీలో రూ.1,39,463లు, భీంపూర్ మండలం గోముత్రి పంచాయతీలో రూ.1,33,234 మేర ఈఎంఐ బకాయిలు చెల్లించాల్సి ఉంది. నిధుల కొరతతో కిస్తీల చెల్లింపులు నిలిచిపోగా, బ్యాంకర్ల నుంచి ఒత్తిడి పెరుగుతోందని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

- జీపీలకు ఏడాదిగా నిలిచిన నిధులు
- ఇబ్బందులు పడుతున్న కార్యదర్శులు
- జిల్లాలో ఈఎంఐ బకాయిలు రూ.2.38 కోట్లు



పోచంపల్లి పంచాయతీ కార్యాలయం

కైలాస్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు ఏడాదిగా నిధులు విడుదల కావడం లేదు. దీంతో ఆయా గ్రామాలకు కేటాయించిన ట్రాక్టర్‌కు సంబంధించిన కిస్తీలను కార్యదర్శులు చెల్లించలేకపోతున్నారు. ప్రతి నెలా ఒక్కో పంచాయతీ రూ.8వేల నుంచి రూ.15వేల వరకు ఈఎంఐ చెల్లించాల్సి ఉంది. నిధుల కొరతతో ఏడాదిగా ఈ చెల్లింపులు నిలిచిపోయాయి. ఇప్పటి వరకు ఒక్కో పంచాయతీ బకాయిలు రూ.50వేల నుంచి రూ.లక్ష 20వేల వరకు పేరుకుపోయాయి.

ఇదీ పరిస్థితి

పల్లె పాలనకు ప్రాధాన్యతనిచ్చిన గత బీఆర్‌ఎస్ సర్కారు గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ కోసం ప్రతీ జీపీకి ట్రాక్టర్‌తో పాటు డోజర్, ట్రాలీని మంజూరు చేసింది. జిల్లాలోని 468 గ్రామ పంచాయతీల్లో బ్యాంకు రుణాలతో వీటిని కొనుగోలు చేశారు. వీటి ద్వారా పల్లెలకు ప్రయోజనం చేకూరినా నిధుల కొరతతో బ్యాంకు కిస్తీలు చెల్లించేందుకు కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా 361 జీపీల పరిధిలో ఏడాదిగా పేరుకుపోయిన బకాయిలు రూ.2కోట్ల 38లక్షల 57వేల 244గా ఉన్నాయి.

నిర్వహణ భారం..

పంచాయతీల్లో చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్ల నిర్వహణ చిన్న జీపీలకు భారంగా మారుతోంది. నెలవారీ డీజిల్ వినియోగం రూ.3వేల నుంచి రూ.5వేల వరకు అవుతుండగా, మరమ్మతు కోసం మరో రూ.5వేల వరకు అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. వీటితో పాటు ఈఎంఐ చెల్లింపులు మరింత భారమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో పాటు నిర్వహణ భారంగా మారుతుండడంతో ట్రాక్టర్ ఈఎంఐలు చెల్లించలేకపోతున్నట్లు కార్యదర్శులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం విడుదల చేసే నిధులు సిబ్బంది జీతాలు, కరెంట్ బిల్లులకే సరిపోతున్నట్లు చెబుతున్నారు. ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, బేల వంటి మేజర్ పంచాయతీల్లో పరిస్థితి పర్వాలేదనిపించినా చిన్న పంచాయతీలకు మాత్రం ఇక్కట్లు తప్పడం లేదు.

నిధుల్లో కోత పెడుతున్న బ్యాంకులు..

జీపీలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి ప్రతి నెలా నిధులు విడుదల చేయాల్సి ఉంది. అయితే సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటి నుంచి ఆ నిధుల విడుదల నిలిచిపోయింది. సిబ్బంది జీతాలు సైతం చెల్లించలేని పరిస్థితి తలెత్తడంతో తాజాగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసింది. అయితే ప్రత్యేక అకౌంట్లు లేనటువంటి పంచాయతీల నిధుల్లో నుంచి బ్యాంకులు ఈఎంఐ బకాయిలు కట్ చేసుకున్నాయి. కార్మికుల వేతనాల కోసం విడుదల చేసిన నిధుల్లో బ్యాంకులు కోత పెట్టడంతో కార్యదర్శులు లబోదిబోమంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి బకాయిల చెల్లింపు కోసం పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

నిధులు విడుదల కాకపోవడంతోనే..

గ్రామ పంచాయతీలకు ఏడాదిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కావడం లేదు. దీంతో ట్రాక్టర్ ఈఎంఐల చెల్లింపు ఇబ్బందికరంగా మారుతుంది. జనరల్ ఫండ్స్‌కు సంబంధించి ట్రెజరీకి పంచాయతీల నుంచి చెక్కులు పంపించినా అవి పాస్ కావడం లేదు. ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలైతే తప్ప ఏం చేయలేని పరిస్థితి.
– ఎస్.శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని దేవి ఫ్యామిలీ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఉట్నూర్‌కు చెందిన పెందూర్ ఉషారాణి అక్కడికి భోజనం చేసేందుకు వెళ్లగా, మంచూరియాలో కుళ్లిన వాసన రావడంతో డయల్ 100కు ఫోన్ చేశారు. విషయాన్ని పోలీసులు స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించారు. దీంతో ఫుడ్‌సేఫ్టీ అధికారి డాక్టర్ శ్రీధర్‌తో పాటు శానిటరి ఇన్‌స్పెక్టర్ నరేందర్ హోటల్‌కు వెళ్లి తనిఖీలు చేపట్టారు. ఆరు నమూనాలను సేకరించారు. వాటిని ల్యాబ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు.



కుళ్లిన మంచూరియా చూపిస్తున్న ఫిర్యాదుదారు

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

- మార్కెటింగ్‌శాఖ అదనపు డైరెక్టర్ రవికుమార్

ఆదిలాబాద్‌టౌన్: రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డును మంగళవారం సందర్శించారు. రైతులతో మాట్లాడి కొనుగోళ్లకు సంబంధించిన విషయాలపై ఆరా తీశారు. అనంతరం మార్కెటింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో సీసీఐ ద్వారా ఎంతమేర పత్తి కొనుగోళ్లు చేపట్టారు.. ప్రైవేట్ వ్యాపారులు ఎంత కొనుగోలు చేశారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం సాంకేతిక సమస్యతో దేశవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోయినట్లు తెలిపారు. మంగళవారం ప్రైవేట్ వ్యాపారులు వేలం ద్వారా పత్తి క్వింటాలుకు రూ.6,930 ధర నిర్ణయించగా, వేలం ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కందుల కొనుగోళ్లను పరిశీలించి రైతుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెటింగ్ ఏడీ గజానంద్, కార్యదర్శులు మధుకర్, శ్రీకాంత్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న అదనపు డైరెక్టర్ రవికుమార్

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం



స్వామిరెడ్డి(ఫైల్)

కోటపల్లి: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన చల్ల స్వామిరెడ్డి మతిస్థిమితం లేక ఈనెల 4న ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ఇప్పటి వరకూ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 8712656556 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

తేనెటీగల దాడిలో ఫీల్డ్ అసిస్టెంట్‌కు గాయాలు

నెన్నెల: మండలంలోని మన్నెగూడం గ్రామానికి చెందిన ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ లగ్గాము చంద్రయ్యపై మంగళవారం తేనెటీగలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. మన్నెగూడం శివారు అటవీ సమీప ప్రాంతంలో ఉపాధి పనులు జరుగుతుండగా చంద్రయ్య కూలీల హాజరు వేసుకుని ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో తేనెటీగలు దాడి చేయడంతో అతని వీపు, తల, ముఖంగా గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు 108లో నెన్నెల పీహెచ్‌సీకి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికి తరలించారు.

రూ.5.70 లక్షల నగదు పట్టివేత



నగదు చూపిస్తున్న పోలీసులు

తానూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బెల్‌తరోడా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం రూ.5.70 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై శాముల్ తెలిపారు. కరీంనగర్ నుంచి మహారాష్ట్రలోని భోకర్‌కు వెళ్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా నగదు పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందువల్ల ఎవరైనా రూ.50 వేలకు మించి తీసుకెళ్లవద్దని, ఒక వేళ తీసుకువెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

పెళ్లి సందడి

- మొదలైన శుభ ముహూర్తాలు...
- మోగుతున్న పెళ్లి భాజాలు
- మాఘం, ఫాల్గుణ మాసాల్లో కల్యాణ ఘడియలు

ఐదు నెలల్లో శుభముహూర్తాలివే...
ఫిబ్రవరి 13, 14, 15, 18, 19, 20, 21, 23, 25..
మార్చి 1, 2, 6, 7, 12,
ఏప్రిల్ 14, 16, 18, 19, 20, 21, 25, 29, 30..
మే 1, 5, 6, 8, 15, 17, 18,
జూన్ 1, 2, 4, 7...



ఐదు నెలలు సుముహూర్తాలు



నూరేళ్లపాటు గుర్తుండిపోయే వివాహ వేడుక నిర్వహించేందుకు వధూవరులు, ఇరువర్గాల పెద్దలు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. జనవరి 30 నుంచి మాఘ మాసం ప్రారంభమవుతోంది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్‌లో వివాహాది శుభలగ్నాలకు దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయి. రానున్న కాలంలో విరివిగా వివాహ వేడుకలు సాగే అవకాశం ఉంది.

– సముద్రాల శ్రీకాంతాచార్యులు, పంచాంగకర్త నిర్మల్

నిర్మల్‌ఖిల్లా: పెళ్లంటే నూరేళ్లపంటగా భావిస్తుంటారు. భారతీయ సంప్రదాయ వ్యవస్థలో వివాహ వేడుకకు ప్రత్యేక స్థానముంది. ఎందరో యువతీయువకుల జీవితకాల స్వప్నం పెళ్లివేడుక. ఇలాంటి జంటలు ఏకమయ్యేది వివాహబంధంతోనే. ఆ తరుణం మొదలైంది.. ఈ నెల మొదటి నుంచే శుభ ముహూర్తాలు మొదలైనట్లు పంచాంగకర్తలు, పురోహితులు పేర్కొంటున్నారు. శుభ ముహూర్తాల కోసం ఇప్పటికే పెళ్లిళ్లు ఖరారు చేసుకుని వేచి చూస్తున్న కుటుంబాల వారెందరో ఉన్నారు. మాఘం అంటే ఫిబ్రవరి మొదలుకుని జూన్ మొదటివారం వరకు పెళ్లిళ్లకు శుభ ముహూర్తాలు ఉన్నట్లు వేదపండితులు పేర్కొంటున్నారు. దీంతో పెళ్లిళ్లకు, భాజా భజంత్రీలు, సన్నాయి మేళాలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే మాట ముచ్చట, పెళ్లిచూపులు, సంప్రదింపులు పూర్తయిన ఇరు కుటుంబాల పెద్దలు వివాహ వేడుకల కోసం సిద్ధమవుతున్నారు. ఇక నూతనంగా పెళ్లిళ్లు ఖరారు చేసుకున్న యువతీ యువకులు ఏ తేదీల్లో పెళ్లిళ్లు పెట్టుకోవాలో ఆలోచన చేస్తున్నారు. ఈనెల 1న మొదలైన పెళ్లిళ్లు వచ్చే జూన్ 7వ తేదీ వరకు వివాహ ముహూర్తాలు ఉన్నట్లు చెబుతున్నారు. మాఘ మాసంలో మొదలయ్యే సుముహూర్తాలు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో శుభలగ్నాలు ఎక్కువగా ఉన్నాయి.

మొదలైన సందళ్లు ...

శుభలగ్నాలతో పెళ్లి పెద్దలు, సంబంధిత కుటుంబాల వారు వేడుకలకు సన్నద్ధమవుతున్నారు. వివాహ వేదికలు, ఫంక్షన్ హాళ్లు ఖరారు నుంచి మొదలుకుని భోజన సదుపాయాలు, డెకొరేషను, పెళ్లి వేడుకలకు అవసరమయ్యే నూతన వస్త్రాల కొనుగోలు, బంగారు ఆభరణాల తయారీ నిమిత్తం సమాయత్తమవుతున్నారు. పెళ్లిలో ఏర్పాట్లకు వ్యూహరచన చేస్తున్నారు. ఫొటోషూట్, ప్రీవెడ్డింగ్ షూట్ వంటి వాటికి వధూవరులు సిద్ధమవుతున్నారు. ఇక వివాహాలు నిర్వహించే ఫంక్షన్ హాళ్లలో డెకరేషన్ల హంగామా మొదలైంది. వేడుకల నిర్వహణ అనుబంధ రంగాలవారికి ఉపాధి దొరికేందుకు అనువైన సమయమని భావిస్తున్నారు.

రికార్డుస్థాయిలో బంగారం ధర

మూడేళ్లలో బంగారం ధరలు (10 గ్రాములకు)		
తేదీ	సంవత్సరం	ధర (రూ.లలో)
ఫిబ్రవరి 11	2023	56,800
ఫిబ్రవరి 11	2024	64,500
ఫిబ్రవరి 11	2025	89,200

నిర్మల్‌ఖిల్లా: పసిడి ధరలు రోజురోజుకూ పైపైకి పోతున్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. మంగళవారం నాటికి మార్కెట్లో 10 గ్రాములకుగానూ రూ.89,200 కొనసాగింది. మేలిమి బంగారం 12 గ్రాములు రూ.1,04,040 ధర పలుకుతోంది. గత ఏడాది ఇదే సమయంలో బంగారం తులానికి ఇంచుమించు రూ.65 వేలు ఉండగా ఈ ఏడాది ఏకంగా రూ.90 వేలకు చేరువలో ఉంది. వివాహ ముహూర్తాలు విరివిగా ఉన్న ప్రస్తుత తరుణంలో బంగారం కొనుగోళ్లతో కళకళలాడాల్సిన దుకాణాలు వెలవెలబోతున్నాయి. వధువుకు పెళ్లి ఆభరణాలు చేయించేందుకు గతంలో పది తులాల వరకు కొనుగోలు చేస్తుండగా ప్రస్తుతం రెండు మూడు తులాలకే పరిమితమవుతున్నారు. దీంతో బంగారు ఆభరణాలు తయారుచేసే స్వర్ణకారులకు కూడా తగినంత పనులులేక ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బులియన్ మార్కెట్‌లో హెచ్చుతగ్గులు, రూపాయి మారకవిలువ తగ్గడం వల్లే పసిడి ధరలు ఆకాశాన్నంటుతున్నాయని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి ధరలు ఇప్పట్లో తగ్గే అవకాశం లేదని బంగారం వర్తక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఒకేరోజు మూడుసార్లు పెరుగుదల

సోమవారం రికార్డు స్థాయిలో ఒకేరోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు సార్లు బంగారం ధర పెరిగింది. ఉదయం 11 గంటల ప్రాంతంలో రూ. 87,800 ధర నమోదు కాగా మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో రూ.88,000 చేరువైంది. ఇక 3 గంటల ప్రాంతంలో ఏకంగా రూ.88,400 ధర పలికింది. గంటల వ్యవధిలోనే బంగారం ధర మారుతుండడంతో వినియోగదారులు విస్మయం చెందుతున్నారు. మంగళవారం నాటికి రూ.89,200 కు చేరింది.

తరలిపోనున్న ఏసీబీ కార్యాలయం!



ఆదిలాబాద్‌లోని ఏసీబీ కార్యాలయం

- మంచిర్యాల కేంద్రంగా నిర్వహణ..
- ఈనెల 14న తరలించనున్నట్లు సమాచారం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కార్యాలయం మంచిర్యాల జిల్లాకు తరలిపోనుంది. ఈ నెల 14న ఇక్కడి నుంచి తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. మంచిర్యాలలోని సింగరేణి క్వార్టర్స్‌లో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదివరకు పనిచేసిన అధికారులు జిల్లాలో ఉన్న కార్యాలయాన్ని మంచిర్యాలకు తరలించేందుకు ఉన్నతాధికారులకు లేఖ రాయడంతో అనుమతి వచ్చినట్లు సమాచారం. ఇదివరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కొనసాగిన స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సైతం అధికారులు మంచిర్యాల జిల్లాకు తరలించారు. ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉన్న ఆదిలాబాద్ నుంచి మంచిర్యాల జిల్లాకు కార్యాలయాలను తరలించడంపై జిల్లా ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆదిలాబాద్ జిల్లాలో ఏసీబీ కేసులు ఎక్కువగా నమోదు కావడం లేదని, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లోనే ఎక్కువగా నమోదు అవుతుండడంతో ఈ కార్యాలయాన్ని అక్కడికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఏసీబీ అధికారులకు జిల్లా అనుకూలంగా లేకపోవడం, మంచిర్యాల ప్రాంతంలో రైల్వే స్టేషన్ ఉండడంతో వారి జిల్లాలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉండడంతోనే అక్కడికి తరలిస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

ఆదిలాబాద్ వాసులకు ఇబ్బందులు

జిల్లా కేంద్రంలో ఉన్న ఏసీబీ కార్యాలయాన్ని మంచిర్యాలకు తరలిస్తుండడంతో జిల్లా వాసులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. జిల్లాలో అధిక శాతం మంది గిరిజనులు ఉండడం, అమాయక ప్రజలను కొంతమంది అధికారులు, ఉద్యోగులు అక్రమ వసూళ్లు చేసినప్పుడు ఏసీబీని ఆశ్రయించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు జిల్లా కేంద్రంలో ఉన్నతాధికారులు లేకపోవడంతో బాధితులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఇదివరకు జిల్లాకు ఇన్‌చార్జి డీఎస్పీ ఉండగా ప్రస్తుతం రెగ్యులర్ డీఎస్పీని ప్రభుత్వం నియమించింది. ఇద్దరు సీఐలతో పాటు నలుగురు కానిస్టేబుళ్లు, నలుగురు హోంగార్డులు పనిచేస్తున్నారు. ముఖ్య కార్యాలయాన్ని మంచిర్యాలకు తరలించి నామ్‌కే వాస్తేగా జిల్లా కేంద్రంలో సబ్ కార్యాలయాన్ని అందుబాటులో ఉంచుతారనే చర్చ సాగుతోంది. ఇద్దరు హోంగార్డులు మాత్రమే అందుబాటులో ఉండే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. ఈ విషయమై ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్‌ను సంప్రదించగా ఆదిలాబాద్‌తో పాటు మంచిర్యాలలో ఏసీబీ కార్యాలయం కొనసాగుతుందని పేర్కొన్నారు.

చుక్కలదుప్పిపై వీధికుక్కల దాడి



గాయపడిన చుక్కలదుప్పి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వనం నుంచి జనావాసాల్లోకి వచ్చిన ఓ చుక్కలదుప్పిపై వీధికుక్కలు దాడిచేయడంతో గాయాలయ్యాయి. మంగళవారం ఉదయం ముల్కల్ల అటవీ బీట్ పరిధి నుంచి చుక్కలదుప్పి గుడిపేట గ్రామ శివారులోని ఎస్సీ కాలనీలోకి ప్రవేశించింది. కాలనీలోని వీధికుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. గమనించిన స్థానికులు వాటి బారి నుంచి కాపాడి అటవీ అధికారులకు సమాచారం అందించారు. పాతమంచిర్యాల అటవీ బీట్ సెక్షన్ అధికారి అతావుల్లా, బీట్ అధికారి రాజేందర్ గ్రామానికి చేరుకుని దుప్పి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వైపు వెళ్లేలా చేశారు. ఇటీవల కరీంనగర్ నుంచి తీసుకువచ్చి హాజీపూర్ మండలం గఢ్‌పూర్ పంచాయతీ పరిధిలోని జంగల్ సఫారీలోకి వదిలిపెట్టిన చుక్కలదుప్పిగా గుర్తించారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

భైంసారూరల్: చేపలవేటకు వెళ్లి చెక్‌డ్యాంలో నీటమునిగి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మాలిక్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని వాలేగాం గ్రామానికి చెందిన పల్లపు నర్సయ్య (45) సోమవారం చేపలు పట్టేందుకు మాటేగాం సమీపంలోని చెక్‌డ్యాంకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగిరాకపోవంతో మంగళవారం కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా గజ ఈతగాళ్లలో గాలించి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతునికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ పర్యటన

లక్ష్మణచాంద: టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి మంగళవారం జిల్లాలో పర్యటించారు. లక్ష్మణచాంద మండలంలోని తిర్పెల్లి రైస్‌మిల్లులో సోమవారం సివిల్ సప్లయ్ అధికారులు, పోలీసులు సంయుక్తగా దాడులు నిర్వహించగా 3,011 మెట్రిక్ టన్నుల వరిధాన్యం గోల్‌మాల్ అయినట్లు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి ఆకస్మికంగా పర్యటించారు. తిర్పెల్లి, లక్ష్మణచాంద, పొట్టపెల్లి, రాచాపూర్, వడ్యాల్, కనకాపూర్ గ్రామాల్లోని రేషన్ షాపులను తనిఖీ చేశారు. అనంతరం సోన్ మండలంలోని కూచన్‌పెల్లిలో రేషన్‌షాపును తనిఖీ చేశారు. నిర్మల్ మండలంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను సందర్శించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శేఖర్ రెడ్డి, ఎస్సై శ్రీనివాస్‌రావు, ఎన్‌ఫోర్స్‌మెంట్‌డీటీ కార్తీక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

- గ్రాడ్యుయేట్ స్థానానికి 68, టీచర్ స్థానానికి 16 మంది బరిలో..

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన ముగిసింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 100 మంది అభ్యర్థులు 192 నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో వివిధ కారణాల వల్ల 32 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా 68 ఆమోదించారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 17 మంది 38 నామినేషన్లు దాఖలు చేయగా ఒక నామినేషన్ రిజెక్ట్ అయింది. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించిన సందర్భంలో ఏవైనా లోపాలు ఉంటే గుర్తించి అభ్యర్థులకు షార్ట్ మెమోలు ఇచ్చి సరిచేసుకునేందుకు అవకాశం కల్పించామని అన్నారు. సరైన ఫార్మాట్‌లో సమర్పించని నామినేషన్లను తిరస్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ రామన్, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్, ఏవో నరేందర్, తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

కళాకారుల డిమాండ్లు అసెంబ్లీలో ప్రస్తావిస్తా

- నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



చిన్నారికి అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే

నిర్మల్‌టౌన్: అసెంబ్లీ సమావేశాల్లో కళాకారుల డిమాండ్లను ప్రస్తావించి పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో తెలంగాణ సాంస్కృతిక కళా సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కళా ఉత్సవం అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే కళాకారులకు ఉద్యోగ ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఆ ప్రభుత్వం తోవలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కళాకారులను తప్పకుండా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం కళాకారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరినాయక్, ఒడిసెల అర్జున్, సుంకరి సాయి, కళా సంస్థ అధ్యక్షురాలు పాట రాజశ్రీ, జిల్లా అధ్యక్షుడు దిగంబర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్, కళాకారులు పసుల రవి, మాడ సతీశ్, మగ్గిడి సూరజ్, జానా అజయ్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు
- రూ.7.48 లక్షల విలువైన 208 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్: అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవని కుమురంభీం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 208 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. మంగళవారం సిర్పూర్(టి)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిర్పూర్(టి) పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అందిన పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి హుడ్కిలి చెక్‌పోస్ట్ ప్రాంతంలో ఐచర్ వ్యాన్‌ను తనిఖీ చేయగా 108 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. డ్రైవర్ ఇషాక్ అహ్మద్‌ను విచారించగా తన యజమాని మహ్మద్ రజాక్ రహెమాన్ ఆదేశాల మేరకు మహారాష్ట్రలోని వీరూర్ గ్రామానికి చెందిన ఉప్పరె సంతోష్ వద్దకు తీసుకెళ్తున్నట్లు తెలిపాడు. సంఘటన స్థలానికి కిలోమీటర్ దూరంలో ఒక రెడ్ కలర్ మినీ మహీంద్రా వాహనాన్ని తనిఖీ చేయగా 42 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. డ్రైవర్ మహ్మద్ కలీంను విచారించగా మహారాష్ట్రలోని వీరూర్ గ్రామానికి చెందిన ఉప్పరె సంతోష్ వద్దకు తీసుకెళ్తున్నట్లు తెలిపాడు. ఈ రెండు వాహనాలకు ఒకరే యజమాని అని గుర్తించామన్నారు. మధ్యాహ్నం సమయంలో వచ్చిన సమాచారం మేరకు ఇటికల పహడ్ గ్రామానికి వెళ్తున్న దారిలో గ్రౌండ్ వద్ద చెట్ల పొదల్లో ఒక మినీ మహీంద్రా వ్యాన్ గుర్తించామన్నారు. అక్కడికి వెళ్లి చూడగా మరో వాహనం కనిపించిందన్నారు. అందులోనూ 58 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లుగా గుర్తించామన్నారు. కాగజ్‌నగర్‌లోని తైబానగర్‌కు చెందిన సయ్యద్ ఆరిఫ్ ఆ వాహనం తనదేనని, తానే డ్రైవర్, యజమాని అని ఒప్పుకున్నాడు. ఈబియ్యం మహారాష్ట్రలోని వీరూర్ గ్రామానికి చెందిన ఉప్పరె సంతోష్‌కు అప్పగించేందుకు వెళ్తున్నట్లు తెలిపాడు. వాహనాల యజమాని మహమ్మద్ రజాక్ రెహమాన్‌తో పాటు సయ్యద్ ఆరిఫ్‌లను విచారించగా అతను కూడా భీమిని మండలం జనకాపూర్ గ్రామానికి చెందిన రాకేష్, అశోక్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. పంచనామా నిర్వహిస్తున్న క్రమంలో ఇందులోని కొన్ని బియ్యం బస్తాలు డైరెక్ట్‌గా తెలంగాణ ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న రేషన్ డీలర్ షాపులో నుంచి వచ్చినట్లుగా గుర్తించామన్నారు. దీనిపై పూర్తి విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు. మూడు వాహనాల్లో కలిపి 208 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభ్యమైనట్లు ఎస్పీ పేర్కొన్నారు. వాటి విలువ రూ.7,48,800 ఉంటుందన్నారు. మొదటి వాహన డ్రైవర్ ఇషాక్ అహెమద్, రెండో వాహన డ్రైవర్ మహమ్మద్ కలీం, మూడో వాహన డ్రైవర్, యజమాని సయ్యద్ ఆరిఫ్‌లపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి అందుగులపేట సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లాలోని (బసంత్‌నగర్) కన్నాల గ్రామానికి చెందిన కనుకయ్య (40) ఎన్టీపీసీలో లారీలో జిప్సం నింపుకుని మహారాష్ట్రలోని మణిగఢ్‌కు వెళ్లి వస్తుండగా అందుగులపేట వద్ద జాతీయ రహదారిపై నీళ్ల ట్యాంకర్‌ను ఢీకొట్టాడు. లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు కావడంతో కనుకయ్య అందులో ఇరుక్కుని ఊపిరాడక మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ తీగలకు తగిలి వృద్ధుడు, గేదె..

కాసిపేట: పెరటిచుట్టూ అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి వృద్ధుడు, గేదె మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు కోనూర్‌కు చెందిన అంకతి మల్లయ్య (64)కు చెందిన గేదె కనిపించకపోవడంతో మంగళవారం వెతికేందుకు వెళ్లాడు. ఎంతకూ తిరిగిరాకపోవడంతో అతని కుమారుడు శ్రీకాంత్ తన తండ్రికోసం వెతుకుతుండగా అంకతి రాజయ్య ఇంటి వెనకాల పెరటిచుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు తగిలి మల్లయ్య, గేదె మృతిచెంది ఉండడాన్ని గమనించారు. మృతుని కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు నిందితుడు అంకతి రాజయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వందఫీట్ల రోడ్డు మూల మలుపు వద్ద 2024 డిసెంబర్ 9న రాత్రి 10 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. హాజీపూర్ మండలం ముల్కల్లకు చెందిన జెట్టి శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై మంచిర్యాలలోని గణేశ్‌నగర్‌కు వెళ్తుండగా సీసీసీ వైపు నుంచి మంచిర్యాలకు బైక్‌పై వస్తున్న జెట్టి శ్రీనివాస్‌ను అతివేగంగా ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ముందుగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. శ్రీనివాస్ తండ్రి ఐలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన అప్పు గొడవ



భాగ్యరేఖ(ఫైల్)

మంచిర్యాలక్రైం: అప్పు ప్రాణానికి ముప్పు అంటారు పెద్దలు..కుటుంబ అవసరం నిమిత్తం భార్యాభర్తలు కలిసి తీసుకున్న రుణం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని వడ్డెరకాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై వినీత తెలిపిన వివరాల మేరకు జైపూర్ మండలం ఇందారంకు చెందిన భాగ్యరేఖ(32)కు వడ్డెర కాలనికి చెందిన మనుబోతుల సురేష్‌తో పదేళ్లక్రితం వివాహమైంది. కొద్దిరోజుల క్రితం కుటుంబ అవసరాల నిమిత్తం తెలిసిన వారి వద్ద లక్షా 50వేలు అప్పుగా తీసుకున్నారు. ఈ విషయంలో ఇద్దరికీ తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 10న మళ్లీ గొడవ జరగడంతో సురేష్ భీమారంలో ఉంటున్న అక్క ఇంటికి వెళ్లగా భాగ్యరేఖ స్థానికంగా ఉంటున్న అత్తగారింటికి వెళ్లింది. మంగళవారం ఉదయం తాము ఉంటున్న ఇంటికి వచ్చిన భాగ్యరేఖ ఇంటిపైకప్పుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి గంట లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ కాలనీకి చెందిన బూడిద తిరుపతి-సుమలత దంపతుల కుమార్తె శునిష (22) అదృశ్యమైనట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. సదరు యువతి తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండగా తల్లి సుమలత మందలించింది. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 4న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికినా ఆ చూకీ లభించకపోవడంతో మంగళవారం సుమలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్కెట్ కార్యదర్శుల సస్పెన్షన్

- వరంగల్ రీజియన్‌లో ఏడుగురిపై వేటు
- సీసీఐ కొనుగోళ్లపై ఆరా.. టీఆర్‌లో తేడాలే కారణం

వరంగల్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లలో జరిగిన అవకతవకలపై వరంగల్ రీజియన్‌లోని ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. (సీసీఐ) పత్తి కొనుగోళ్ల కోసం జారీ చేసిన టెంపరరీ రిజిస్ట్రేషన్(టీఆర్)లో తేడాలు గుర్తించిన అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో ఆదిలాబాద్, చెన్నూర్, పెద్దపల్లి, వరంగల్, జనగామ, భద్రాచలం, సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మార్కెట్ కార్యదర్శులు ఉన్నట్లు వరంగల్ రీజియన్ జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. వ్యవసాయ అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాల్లో, మార్కెట్ జారీ చేసిన టీఆర్‌లో తేడాలు ఉన్నట్లు గుర్తించిన ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, జనగామ మార్కెట్ కార్యదర్శిశ్రీనివాస్‌సస్పెన్షన్‌కు గురైనట్లు ఆయన పేర్కొన్నారు.

పెద్ద మొత్తంలో కొనుగోళ్లు..

ప్రస్తుత సీజన్‌లో దళారులు రైతుల పేరుతో పెద్ద మొత్తంలో పత్తిని తీసుకొచ్చి సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించినట్లు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. దీంతో అధికారులు రాష్ట్రంలోని మార్కెట్ కమిటీల వారీగా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. గతేడాదికంటే రెట్టింపుగా ఈఏడాది సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు జరగడంతో ఫిర్యాదులకు బలం చేకూరింది. పత్తి సాగు చేసిన సమయంలోనే ఆయా మండలాల్లోని వ్యవసాయ అధికారులతో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. విషయం తెలియని పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్ముకునేందుకు సంబంధిత ఏఓలతో ధ్రువీకరణ పత్రాలు పొంది మార్కెట్‌కు వస్తే టెంపరరీ రిజిస్ట్రేషన్(టీఆర్)లను మార్కెట్ అధికారులు జారీ చేస్తారు. ఈ టీఆర్‌ల ప్రకారం సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తుంది.

వెసులుబాటే ఆసరాగా..

ఈ సీజన్‌లో మార్కెటింగ్ శాఖ టీఆర్‌ల జారీ అధికారం మార్కెట్ కార్యదర్శులకు అప్పగించినట్లు తెలిసింది. ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకున్న దళారులు ఇతర జిల్లాల నుంచి పత్తిని కొనుగోలు చేసి ఇక్కడ జారీ చేసిన టీఆర్‌లలో విస్తీర్ణం నమోదు చేసి మార్కెట్ అధికారులను తప్పుదోవ పట్టించినట్లుగా తెలిసింది. విషయం సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో డాటా ఎంట్రీ చేసిన సిబ్బంది గుర్తించినప్పటికీ దళారులతో కుమ్మక్కైనందునే ఈదందా కొనసాగినట్లుగా తెలుస్తోంది. ఈకారణంగా మార్కెట్ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటుపడినట్లు సమాచారం.